సాక్షి సంగారెడ్డి
సోమవారం । 2 । డిసెంబర్ । 2024



కాలా నమక్..

దీర్ఘకాలిక వ్యాధులకు చెక్ పెడుతున్న కాలా నమక్ వరి సాగు. నాగపురి గ్రామంలో ఓ రైతు పదేళ్లుగా సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వివరాలు 8లో ▸



మెతుకుసీమ మణిమకుటాలు

పుట్టిన గడ్డకు వన్నె తెస్తున్నారు. విభిన్న రంగాల్లో రాణిస్తూ తమదైన ముద్ర వేస్తున్నారు. వివరాలు 8లో ▸



అపరిశుభ్రంగా ఆఫీసులు

అధికారుల నిర్లక్ష్యం.. నిర్వహణ లోపంతో ప్రభుత్వ కార్యాలయాలు అపరిశుభ్రంగా మారాయి. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న మతోన్మాదులు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: మతోన్మాదులు, కార్పొరేట్‌లు రాజ్యాంగ హక్కులను కాలరాసేందుకు కుట్రలు చేస్తున్నాయని, వీటిని పోరాట శక్తితో అడ్డుకోవాల్సిన అవసరం ఉందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పిలుపునిచ్చారు. ఈ నెలలో సంగారెడ్డిలో జరగనున్న సీపీఐఎం రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా "మతోన్మాదం సవాళ్లు–రాజ్యాంగ హక్కుల పరిరక్షణ"అనే అంశంపై ఆదివారం కేవల్ కిషన్‌భవన్‌లో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, సమాఖ్య వాదం, సోషలిజం అనే ఐదు మౌలికమైన హక్కులను రాజ్యాంగం కల్పించిందన్నారు. రాజ్యాంగం ప్రజలకు ప్రసాదించిన ప్రాథమిక హక్కుల్ని హరించే కుట్రలు కేంద్ర ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. ఈ నెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డి పట్టణంలో నిర్వహించనున్న సీపీఐఎం రాష్ట్ర 4వ మహాసభల్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లికార్జున్, మల్లేశం, రాజయ్య, మాణిక్యం, రాంచందర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

గత పల్స్ పోలియో సర్వే బకాయిలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: గతంలో చేసిన లెప్రసీ, పల్స్ పోలియో సర్వేకు సంబంధించిన డబ్బులు వెంటనే చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాయిలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 2 నుంచి చేపట్టిన తాజా సర్వేకు పనిచేస్తారని ఆయన తేల్చి చెప్పారు. ఆదివారం సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో ఆశా యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 2 నుంచి లెప్రసీ సర్వే చేయాలని ఆశాలకు అధికారులు చెబుతున్నారని గత రెండేళ్ల నుంచి సర్వే చేసిన డబ్బులు ఇప్పటివరకు చెల్లించకుంటే ఎలా చేస్తారని ప్రశ్నించారు. సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి యశోద నాయకులు ప్రశాంతి,లక్ష్మీ,శిరీష, గంగ,శశికళ, లక్ష్మీనరసమ్మ,హైమావతి,వైష్ణవి,లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ అమలుపై అభిప్రాయ సేకరణ

- నేడు బీసీ డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్ రాక
- జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో ఏర్పాట్లు

సంగారెడ్డి జోన్: రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో కల్పించాల్సిన రిజర్వేషన్లపై జిల్లాల వారీగా ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా బీసీ డెడికేటెడ్ కమిషన్ పర్యటిస్తూ అభిప్రాయాలను సేకరిస్తుంది. ఇందులోభాగంగా సోమవారం ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి సంగారెడ్డి జిల్లాకు బీసీ డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ భూసాని వెంకటేశ్వర్లు వస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీశ్వర్ వెల్లడించారు.సంగారెడ్డి పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అభిప్రాయ సేకరణ కార్యక్రమం ఉదయం 10:00 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించనున్నారు. కమిషన్ ఛైర్మన్, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అధికారులు, సంఘాల నేతలు, తదితరులు హాజరుకానున్నారు. త్వరలో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రిజర్వేషన్లు, దామాషా వివరాలు ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి అభిప్రాయాలను సేకరించనున్నారు. ఆసక్తి గలవారు రాతపూర్వకంగా తమ అభిప్రాయాలను నేరుగా కమిషన్‌కు అందించవచ్చు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని మోడల్ పాఠశాల,కళాశాలలో భౌతిక,గణితం, వృక్ష శాస్త్రం బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను జతచేస్తూ దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పాపారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు మొబైల్ నంబర్ 80084 17236 ను సంప్రదించవచ్చన్నారు.

సోలార్ లేదు.. వేడినీళ్లూ లేవు

చలికాలంలో చన్నీటితోనే స్నానం చేస్తున్న సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు

- ఎస్సీ హాస్టళ్లలో ఉన్నా అనేక ప్రాంతాల్లో నిరుపయోగం
- గురుకులాలు, కేజీబీవీ పాఠశాలల్లో అందుబాటులో లేని గీజర్లు
- పలు హాస్టళ్లలో కట్టెల పొయ్యిలపై నీళ్లు కాచుకుంటున్న విద్యార్థులు
- సీఎస్ఆర్ నిధులతో సోలార్ యూనిట్ల ఏర్పాటుకు అధికారుల కసరత్తు



జహీరాబాద్‌లోని ఎస్సీ హాస్టల్‌లో నిరుపయోగంగా ఉన్న సోలార్ యూనిట్

జహీరాబాద్: జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల సోలార్ యూనిట్ల ఏర్పాటుకు నోచుకోలేక పోతున్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా నిధుల కేటాయింపులు లేక పోవడమే ఇందుకు కారణంగా చెప్పవచ్చు. దీంతో విద్యార్థులకు చలికాలంలో చన్నీళ్ల స్నానమే దిక్కవుతోంది. పలు హాస్టళ్లలో కట్టెల పొయ్యిలపై చన్నీళ్లు అందిస్తున్నా ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న హాస్టళ్లలో పూర్తిస్థాయిలో అందించలేని పరిస్థితి ఉంది. ఎస్సీ హాస్టళ్లకు మినహా ఇతర సంక్షేమ హాస్టళ్లలో సోలార్ యూనిట్ల ఏర్పాటును ప్రభుత్వం మరిచిపోయింది. సంగారెడ్డి జిల్లాలో 48 ఎస్సీ సాంఘీక సంక్షేమ హాస్టళ్లు ఉండగా 35 హాస్టళ్లలో సోలార్ యూనిట్లను ఏర్పాటు చేశారు. ఇందులో 10 యూనిట్ల వరకు నిర్వహణలోపంతో నిరుపయోగంగా మారాయి. 35 హాస్టళ్లు సొంత భవనాల్లో కొనసాగుతుండగా, మిగతావి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. జిల్లాలో 35 బీసీ సంక్షేమ హాస్టళ్లు ఉండగా ఏ ఒక్క హాస్టల్‌లో కూడ సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయలేదు. ఎస్టీ హాస్టళ్లు 13 ఉండగా ఏ ఒక్క హాస్టల్‌లో కూడా సోలార్ యూనిట్లు బిగించలేదు. అనేక గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో గీజర్ల ఏర్పాట్లు లేవు. ఉన్న కొన్ని గురుకులాల్లో కూడా విద్యార్థులందరికీ వేడి నీళ్లు అందించలేని పరిస్థితి ఉంది. దీంతో చన్నీళ్ల స్నానమే దిక్కవుతోంది.



స్నానం కోసం జహీరాబాద్‌లోని ఎస్సీ హాస్టల్‌లో కట్టెల పొయ్యిపై నీళ్లు కాచుకుంటున్న విద్యార్థులు

నిరుపయోగంగా సోలార్ యూనిట్లు

జిల్లాలోని పలు ఎస్సీ హాస్టళ్లలో సోలార్ యూనిట్లు పనిచేయక నిరుపయోగంగా పడున్నాయి. జహీరాబాద్, రాయికోడ్, సంగారెడ్డి, జిన్నారం, దేవనూరు, గుమ్మడిదల, అందోల్ ప్రాంతాల్లోని సాంఘీక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు స్నానం చేసేందుకు వేడి నీటి సదుపాయం కల్పించేందుకు వీలుగా నాలుగేళ్ల క్రితం సోలార్ యూనిట్లను ఏర్పాటు చేశారు. భవనాల పైభాగంలో ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్లకు రక్షణగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కోతులు, కొండెంగలు ట్యూబ్‌లను పగలగొడుతుండటం కూడా నిరుపయోగంగా మారేందుకు కారణం అవుతున్నాయి.

ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని సంక్షేమ హాస్టళ్లతో పాటు అన్ని గురుకులాల్లో వేడి నీళ్ల కోసం సోలార్ యూనిట్లు, గీజర్ల సదుపాయం ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

గురుకులాల్లో అంతంత మాత్రంగానే గీజర్లు

జిల్లాలోని ఆయా ప్రభుత్వ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో వేడి నీళ్ల కోసం గీజర్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా అవి అంతంత మాత్రంగానే అమలవుతున్నాయి. పలు గురుకులాల్లో అసలుకే గీజర్లు ఏర్పాటు చేయలేదు. గీజర్లు ఏర్పాటు చేసిన గురుకులాల్లో కూడా విద్యార్థులందరికీ వేడినీళ్లు అందించలేని పరిస్థితి ఉంది. దీంతో బోరు నీటితోనే చన్నీళ్ల స్నానం చేస్తున్నారు. జిల్లాలో ఎస్సీ గురుకులాలు 13 వరకు ఉన్నాయి. ఎస్టీ గురుకులాలు 9 వరకు ఉండగా ఏ ఒక్క గురుకులంలో గీజర్ల ఏర్పాట్లు జరగలేదు. బీసీ గురుకులాలు 12 వరకు ఉన్నాయి.

కేజీబీవీల్లో గీజర్లు కరువు

జిల్లాలో 17 కేజీబీవీ గురుకుల పాఠశాలలు. కళాశాలలు ఉన్నాయి. ఏ ఒక్క పాఠశాలలో కూడ గీజర్ల ఏర్పాటు లేక పోవడంతో విద్యార్థులు చన్నీళ్ల స్నానం చేయాల్సి వస్తోంది. మూడు కేంద్రీయ విద్యాలయాలు ఉన్నాయి. వాటి పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది.

సోలార్ యూనిట్ పనిచేయడం లేదు



తమ హాస్టల్‌లో సోలార్ యూనిట్ ఉన్నా ఏడాదిన్నర కాలంగా పని చేయడం లేదు. దీంతో నిరుపయోగంగా మారింది. దీని కారణంగా వేడినీటి సదుపాయం లేకుండా పోయింది. వేడి నీళ్ల కోసం వార్డెన్ కట్టెల పొయ్యిని ఏర్పాటు చేశారు.

–జగన్, విద్యార్థి–ఎస్సీ హాస్టల్, జహీరాబాద్

నిర్వహణ లోపంతో

హాస్టల్‌లో ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్ నిర్వహణ లోపంతో పని చేయడం లేదు. ప్రతి ఏటా మరమ్మతులు చేయిస్తే సక్రమంగా పనిచేసే అవకాశం ఉంటుంది. కొండెంగలు కూడా వాటిపైకి చేరడంతో పాడవుతున్నాయి.

–బి.కృష్ణవంశీ, వార్డెన్ ఎస్సీ హాస్టల్,జహీరాబాద్

ప్రతిపాదనలు అందించాం

అన్ని హాస్టళ్లలో సోలార్ యూనిట్ల ఏర్పాటు కోసం అవసరం అయిన ప్రతిపాదనలు పంపమని జిల్లా కలెక్టర్ కోరడంతో ఈ మేరకు అందజేశాము. విద్యార్థులకు చన్నీళ్ల స్నానం ఇబ్బందులు దూరం చేసేందుకు గాను కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు.

–అఖిలేష్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ల డిప్యూటీ డైరెక్టర్, సంగారెడ్డి

నాలుగో విడత రుణమాఫీకి రూ.110 కోట్లు



జహీరాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ హామీ అమలు ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మరోమారు నిధులు విడుదల చేసింది. ఇప్పటివరకు మూడు విడతలు విడుదల చేయగా, తాజాగా నాలుగో విడతగా రూ.110 కోట్లు విడుదల చేసింది. మహబూబ్‌నగర్ రైతు పండుగ సభలో శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన ఈ మొత్తాన్ని వివిధ కారణాల వల్ల గతంలో రుణమాఫీ జరగని రైతుల ఖాతాలకు జమ చేశారు. సంగారెడ్డి జిల్లాలో 11,301 మంది రైతులకు గాను సుమారు రూ.110 కోట్లు విడుదల చేశారు. జహీరాబాద్ మండలంలో 1,527 మంది రైతులకు గాను రూ.17.76 కోట్లు రైతుల ఖాతాలలో జమయ్యాయి. కోహీర్ మండలానికి 299 మందికి గాను రూ.3.24 కోట్లు, ఝరాసంఘం మండలంలో 570 మందికిగాను రూ.6.80 కోట్లు, న్యాల్‌కల్ మండలంలో 829 మందికి గాను రూ.9.09 కోట్లు, మొగుడంపల్లి మండలంలో 214 మందికి గాను రూ.2.68 కోట్లు రైతుల ఖాతాలలో జమ చేశారు.

సంగారెడ్డి నియోజకవర్గ మండలాల్లో...

సంగారెడ్డి నియోజకవర్గంలోని కంది మండలంలో 134 మంది రైతులకు గాను రూ.1.22 కోట్లు, కొండాపూర్ మండలంలో 213 మంది రైతులకు గాను రూ.1.92 కోట్లు, సదాశివపేట మండలానికి 773 మంది రైతులకు గాను రూ.7.31 కోట్లు, సంగారెడ్డి మండలానికి గాను 805 మంది రైతులకు గాను రూ.7.46 కోట్లు రైతుల ఖాతాలలో జమ చేశారు.

పటాన్‌చెరు నియోజకవర్గ మండలాల్లో...

పటాన్‌చెరు నియోజకవర్గం లోని గుమ్మడిదల మండలోని 180 మంది రైతులకు గాను రూ.1.57 కోట్లు, జిన్నారం మండలానికి162 మంది రైతులకు గాను రూ.1.53 కోట్లు, పటాన్‌చెరు మండలానికి 409 మంది రైతులకు గాను రూ.3.79 కోట్లు, ఆర్సీ పురం మండలానికి 63 మంది రైతులకు రూ.48 లక్షలు రైతుల ఖాతాలలో జమ చేశారు. నియోజకవర్గంలోని చౌటకూరు మండలానికి 326 మంది రైతులకు గాను రూ.3.11 కోట్లు, జోగిపేట మండలానికి 340 మందికి గాను రూ.2.81కోట్లు, పుల్కల్ మండలానికి 238 మంది రైతులకు గాను రూ.2.06 కోట్లు, మునిపల్లి మండలానికి 335 మంది రైతులకు గాను రూ.3.05 కోట్లు, రాయికోడ్ మండలానికి 458 మందికి గాను 4.46 కోట్లు, వట్పల్లి మండలానికి 313 మందికి గాను రూ.3.17 కోట్లు వారి వారి ఖాతాలలో జమ చేశారు.

ఖేడ్ నియోజకవర్గ మండలాల్లో...

నారాయణ్ ఖేడ్ నియోజకవర్గం లోని కల్హేర్ మండలానికి 157 మంది రైతులకు గాను రూ.1.31 కోట్లు, కంగ్టి మండలానికి 395 మంది రైతులకు గాను రూ.3.35 కోట్లు, మనూర్ మండలానికి 145 మంది రైతులకు రూ.1.49 కోట్లు, నాగల్ గిద్ద మండలానికి 23 మంది రైతులకు రూ.23 లక్షలు, నారాయణ్ ఖేడ్ మండలానికి 1182 మంది రైతులకు గాను రూ.10.97 కోట్లు, నిజామ్ పేట్ మండలానికి 159 మంది రైతులకు గాను రూ.1.25 కోట్లు, సిర్గాపూర్ మండలానికి 300 మంది రైతులకు గాను రూ.2.83 కోట్లు రైతు రుణమాఫీ కింద విడుదల చేశారు. ఈ మేరకు రైతుల ఖాతాలలో జమ చేశారు.

నల్లవాగు కింద సాగుకు సన్నద్ధం

- 4,079 ఎకరాల్లో సాగుకు నిర్ణయం
- నీటి విడుదల చేసేందుకు చర్యలు



నల్లవాగు ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వ

కల్హేర్(నారాయణఖేడ్): జిల్లాలోని మధ్య తరహ ప్రాజెక్టు నల్లవాగు ఆయకట్టు కింద యాసంగిలో పంటల సాగుకు రైతన్నలు సన్నద్ధమయ్యారు. ప్రాజెక్టు ఆయకట్టు 4,079 ఎకరాల ఆయకట్టు కింద ఆరుతడి పంటలు వేసేందుకు ఇటీవల కలెక్టర్ వల్లూరు క్రాంతి అధ్యక్షతన జరిగిన జిల్లా నీటి పారుదల అభివృద్ధి బోర్డు(డీఐబీ) సమావేశంలో అధికారులు నిర్ణయించారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి మట్టం 1,493 అడుగులు. వర్షకాలంలో వానలు పడటంతో ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండింది. కుడి, ఎడమకాల్వ పరిధిలో 6,060 ఎకరాల వరకు ఆయకట్టు ఉంది.

ఆరుతడి పంటలు వేయాలని...

ఎడమ కాలువ కింద 1,085 ఎకరాలు, కుడి కాలువ పరిధిలో 2,994 ఎకరాల్లో పంటలు వేసేందుకు టైబంది ఖరారు చేశారు. నిర్ధారించిన ఆయకట్టు కింద జొన్న, తదితర ఆరుతడి పంటలు వేయాలని నిర్ణయించారు. యాసంగి పంటల సాగు కోసం నీటిని విడుదల చేయాలని సుల్తానాబాద్, పోచాపూర్, తదితర గ్రామల రైతులు ఇటీవలే ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డికి విన్నవించారు. ఎమ్మెల్యే సానుకులంగా స్పందించి నీటి విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ఇటీవల కాల్వల్లో పూడిక తీత పనులు చేపట్టారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి చేతుల మీదుగా నీరు విడుదల చేస్తామని నీటి పారుదల శాఖ డీఈఈ పవన్‌కుమార్ తెలిపారు.

పూర్తి ఆయకట్టుకు నీరు అందించాలి..

నల్లవాగు ప్రాజెక్టు కింద యాసంగిలో పంటలు సాగు చేసేందుకు చివరి గ్రామల ఆయకట్టు రైతులు ఆశలు పెట్టుకున్నారు. కల్హేర్, మార్డి, ఇందిరానగర్ గ్రామాల వరకు పూర్తి ఆయకట్టుకు నీరు అందించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. టైబంది ఖరారు చేయడంతో నీటి విడుదలకు అధికారులు చర్యలు చేపట్టారు. నీటి విడుదలకు నిర్ణయించిన ఆయకట్టు పరిధిలోని రైతులు పంటలు వేసేందుకు పనులు మొదలు పెట్టారు.

సంతోషంగా ఉంది.

నల్లవాగు ఆయకట్టు కింద సాగు కోసం నీటిని విడుదల చేసేందుకు నిర్ణయించడం సంతోషకరం. నీటి విడుదల కోసం కృషి చేసిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డికి రుణపడి ఉంటాం.

–బుడ్డపిరి రాములు, రైతు, బోక్కస్‌గాం

ప్రణాళికాబద్ధంగా కాలనీల అభివృద్ధి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షల సొంత నిధులు

పటాన్‌చెరు: పటాన్ చెరు నియోజకవర్గంలో నూతనంగా ఏర్పడుతున్న కాలనీల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పటేల్‌గూడ సాయి యాక్సిస్ హోమ్స్ కాలనీలో రూ.60 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఆదివారం స్థానిక ప్రజా ప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో గ్రామాలు పట్టణాలుగా వృద్ధి చెందుతున్నాయన్నారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని గ్రామాలు మున్సిపాలిటీలో విలీనంతో పెద్ద ఎత్తున నిధులు మంజూరు కావడంతోపాటు వేగంగా అభివృద్ధి కొనసాగుతుందని తెలిపారు. రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.10 లక్షల రూపాయల సొంత నిధులను అందించారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ ఛైర్మన్ పాండు రంగారెడ్డి, వైస్ ఛైర్మన్ నందారం నరసింహాగౌడ్, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, శ్రీకాంత్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

క్రీడాపోటీలకు రూ.లక్ష అందజేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): క్రీడలాడేందుకు పట్టుదల ఉంటే చాలని వయసుతో పనిలేదని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్ జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా క్రీడాపోటీలకు రూ.లక్ష సొంత నిధులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మాస్టర్ అథ్లెటిక్స్‌లో 60ఏళ్లు నిండిన వారు కూడా క్రీడలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. ఈ వయసులో సైతం పతకాల కోసం పోటీలు పడటం సంతోషంగా ఉందని తెలిపారు. క్రీడల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ జిల్లా అధ్యక్షుడు ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా హాఫ్ మారథాన్

పాల్గొన్న జిల్లా ఎస్పీ, పూర్ణా మలావత్

సంగారెడ్డి జోన్: ఐఐటీ హైదరాబాద్ కందిలో ఆదివారం నిర్వహించిన హాఫ్ మారథాన్–2024 ఉత్సాహ భరితంగా సాగింది. హాఫ్ మారథాన్‌లో పూర్వ విద్యార్థులు, సిబ్బంది సుమారు 1,500మందికి పైగా పాల్గొన్నారు. అతి చిన్న వయస్సులో ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన పూర్ణామలావత్, జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్‌తోపాటు పలువురు హాజరయ్యారు. హాఫ్ మారథాన్ 21.1కి.మీ, 10కి.మీ., 5కి.మీలు మూడు విభాగాలలో పోటీ పడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రతీ ఒక్కరు రన్నింగ్, నడకతో ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు.

సంక్షేమ పథకాలు వివరించండి

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను గ్రామ గ్రామాన ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి కార్యకర్తలకు సూచించారు. కంగ్టి మండలం రాజారం తండాకు చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు మనిరాం, పండరి, మలాఖాన్, సుభాష్, గురుదాస్, గోపాల్, సురేష్‌లు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ చేరారు. కాంగ్రెస్ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లవి పరశురాం, కీరునాయక్, గంగారాం, మాజీ ఎంపీటీసీ మణిరాం ఉన్నారు.

రాంరెడ్డి సేవలు చిరస్మరణీయం


మనూరు మండలం పుల్‌కుర్తి గ్రామానికి చెందిన బి.రాంరెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయం అని సంజీవరెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావులు పేర్కొన్నారు. ఆదివారం రాంరెడ్డి మూడవ వర్ధంతిని పురస్కరించుకుని పుల్‌కుర్తిలో నిర్వహించిన వర్ధంతిసభలో పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, రాంరెడ్డి కుమారులు జగదీశ్వర్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, పుల కూర్తి గ్రామ నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

ఊపిరాడట్లేదు!

- పారిశ్రామికవాడలో ప్రమాదకరస్థాయిలో వాయుకాలుష్యం
- పిల్లలు మహిళలు వృద్ధులపై తీవ్ర ప్రభావం
- కళ్లుమూసుకున్న పీసీబీ!



ఓ పరిశ్రమ నుంచి వెలువడుతున్న విషవాయువులు

జిన్నారం (పటాన్‌చెరు): రసాయన పరిశ్రమల నుంచి వెలువడుతున్న విష వాయువులతో పారిశ్రామిక ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో పరిశ్రమలు నిబంధనలు ఉల్లంఘిస్తూ వాతావరణంలోకి విష వాయువులను విడుదల చేస్తుండటంతో స్థానికులు ముక్కుపుటాలు ఎగిరిపోయే ఘాటు వాసనలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

ఘాటైన వాసనలు...

ఉమ్మడి జిన్నారం గుమ్మడిదల మండలాల్లో పెద్దసంఖ్యలో రసాయన పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల నుంచి పెద్ద ఎత్తున రసాయన విషవాయువులు నిత్యం వాతావరణంలోకి విడుదలవుతుండటంతో స్థానికుల్లో భయాందోళన నెలకొంది. వీటి ద్వారా స్థానిక ప్రజలు శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కొన్ని పరిశ్రమలు వాయు కాలుష్యానికి కేంద్ర బిందువుగా మారుతున్నాయి.

పిల్లలు, వృద్ధుల్లో ఆరోగ్య సమస్యలు...

పారిశ్రామిక వాడల్లో నివసించే పిల్లలు మహిళలు వృద్ధులు సాధారణంగా శ్వాసక్రియ తీసుకోవడంలో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. విష వాయువులు పీల్చుకోవడంతో తల తిరగడం, కళ్ల మంటలు, వాంతులు, విరేచనాలకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఒక్కోసారి ఈ విషవాయువులు వాతావరణంలో కలిసిపోయి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. సదరు పరిశ్రమలపై కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవట్లేదని స్థానికులు వాపోతున్నారు. కాగా, దీనిపై పీసీబీ అధికారులను వివరణ కోరేందుకు సాక్షి ఫోన్ ద్వారా సంప్రదించగా ఎవరూ స్పందించలేదు.

పీసీబీ నిర్లక్ష్యంతోనే సమస్య జటిలం

పారిశ్రామిక వాడల్లోని రసాయన పరిశ్రమలు యథేచ్ఛగా వాతావరణంలోకి ఘాటైన విష వాయువులను విడుదల చేస్తుండటంతో ప్రజల జీవన శైలిపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయని ఫిర్యాదులు అందినా... పీసీబీ అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగానే సమస్య జటిలంగా మారుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు పరిశ్రమలకు వత్తాసుగా పీసీబీ అధికారుల తీరు కనిపిస్తోందని స్థానికులు వాపోతున్నారు.

నిత్యం ఇదే పరిస్థితి



పరిశ్రమలు వాయువులను వాతావరణంలో విడుదల చేయడంతో ఘాటైన వాసనలను తట్టుకోలేకపోతున్నాం. ఈ పరిస్థితి సాయంత్రం వేళల్లో మరీ ఎక్కువగా ఉంటుంది. శ్వాస తీసుకోలేకపోతున్నాం. కళ్ల మంటలు, తలనొప్పి, వాంతులు కూడా అవుతాయి. ఈ పరిస్థితికి బాధ్యులైన పరిశ్రమలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలి.

– సత్యనారాయణ, గడ్డపోతారం గ్రామస్తుడు

పీసీబీ విఫలం



రసాయన పరిశ్రమలను కట్టడి చేసే విషయంలో పీసీబీ విఫలమైంది. మేమంతా కలిసి ఎన్నోసార్లు రామచంద్రాపురంలోని పీసీబీ అధికారులకు ఘాటైన వాసనలపై ఫిర్యాదులు చేశాం. కానీ నామమాత్రపు తనిఖీలు చేసి చేతులు దులుపుకున్నారే తప్ప సమస్యను పరిష్కరించిన దాఖలాలు లేవు. ఇవే పరిస్థితులు ఉత్పన్నమైతే గ్రామం వల్లకాడుగా మారుతుంది. మమ్మల్ని ఈ కాలుష్యం నుంచి కాపాడండి.

– బాలయ్య, గడ్డపోతారం గ్రామస్తుడు

క్లుప్తంగా

సినీనటుడు రవితేజకు అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న గుండు రవితేజ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేటకు చెందిన సినీ నటుడు గుండు రవితేజ ఫైమా అవార్డు అందుకున్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఆన్ ఇంక్రీడ బుల్ టీవీ అండ్ మూవీ ఆర్టిస్ట్ (ఫైమా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవార్డుల ప్రదానోత్సవంలో రిటైర్డ్ ఐఏఎస్ రిటైర్డ్ టీటీడీ జేఈఓ బి.లక్ష్మీకాంతం చేతుల మీదుగా నేషనల్ అచీవర్స్ అవార్డు అందుకున్నారు. జిల్లాకు చెందిన పలువురు ఆయనను అభినందించారు.

గుర్తు తెలియని యువకుడి మృతి



సిద్దిపేటఅర్బన్: చికిత్స పొందుతూ గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. శనివారం సిద్దిపేట పట్టణం.. మిలాన్ గార్డెన్ ఎదురుగా ఖాళీ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తి గాయాలతో పడి ఉన్నాడు. పొన్నాలకు చెందిన సాయిచరణ్ చూసి 108కు సమాచారం ఇవ్వగా సిబ్బంది ఇక్కడికి చేరుకొని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి చనిపోయాడు. మృతుడి వయసు 25 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉంటుందని, మృతుడి ఛాతీపై అంజలి అనే పేరు పచ్చబొట్టు ఉందని తెలిపారు.

గాగిల్లాపూర్‌లో మరో కొండచిలువ కలకలం



మృతిచెందిన కొండచిలువ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిల్లాపూర్‌లోని ఎస్‌సీ కాలనీలో ఆదివారం రాత్రి మరో కొండచిలువ బెంబేలెత్తించింది. దాన్ని తరిమే ప్రయత్నంలో కాలనీవాసుల చేతిలో మృత్యువాత పడింది. గత వారం ఎస్‌టీ కాలనీలో కొండచిలువ కలకలం రేపిన ఘటన మరువక ముందే.. ఉదంతం చేటుచేసుకోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కేవీకేలో ఐఐటీ ప్రొఫెసర్లు



అలోవీర సాగును పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి కేవీకేలో సేంద్రియ పంటల సాగును సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీ ప్రొఫెసర్లు సందర్శించారు. ఆదివారం తునికి వద్ద గల డాక్టర్ రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)కు కుటుంబ సభ్యులతో ప్రొఫెసర్లు డాక్టర్ మల్లారెడ్డి, డాక్టర్ కృష్ణ తదితరులు వచ్చారు. వారికి కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ రవికుమార్, డాక్టర్ ప్రతాప్ రెడ్డి, డాక్టర్ భార్గవి, శ్రీకాంత్ సేంద్రియ పద్ధతిలో చేపట్టిన సాగుపై అవగాహన కల్పించారు. జీవామృతం, బీజామృతం, వర్మికంపోస్ట్, నీమ్‌ఆయిల్, వివిధ కషాయాలు తయారీ, వినియోగం, పంటల సాగు గురించి వివరించారు. బొప్పాయి, అలోవీర సాగును పరిశీలించారు.

దీర్ఘకాలిక వ్యాధులకు చెక్

కాలా నమక్

కాలా నమక్ పేరు కొత్తగా ఉంది. ఇది ఉప్పు కాదు వడ్లు.. బుద్ధుడు ఇచ్చినట్లు చరిత్ర చెబుతుంది. అనారోగ్య సమస్యలు తొలగి జ్ఞానం వైపు తీసుకెళ్తుందని ప్రజల నమ్మకం. ఈ పంటను మన చేర్యాల మండలం నాగపురిలో రైతు తిరుపతి సాగు చేస్తున్నాడు. వర్షాకాలం పంట చేతికి రాగా యాసంగికి రెండు ఎకరాల్లో సాగవుతోంది. నమక్ వల్ల అనేక ప్రయోజనాలు చేగూరుతాయి అంటున్నారు.

నాగపురి.. ఆరోగ్యానికి దారి

- పదేళ్లుగా వరి సాగు
- ఆదర్శంగా నిలుస్తున్న రైతు తిరుపతి
- ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా విదేశాలకు సైతం..



నల్ల వడ్ల వరి చేను

చేర్యాల(సిద్దిపేట): కాల నమక్ తోపాటు మరో 9 రకాల నల్ల వడ్లూ సాగు చేశాడు రైతు తిరుపతి. కేన్సర్, షుగర్, గుండెజబ్బులు, సంతాన సమస్య, మోకాళ్ల నొప్పులు, ఉదరసంబంధ సమస్యలపై ఈ బియ్యంలో ఉండే పోషక, ఔషధ విలువలు ప్రభావం చూపి సమస్యలు మళ్లీ రాకుండా దోహద పడుతుందని డాక్టర్లు, ఆయుర్వేద గ్రంథాలు చెబుతున్నాయి.

నాన్న కోసం..

మా నాన్నకు కేన్సర్ వచ్చింది. నివారణకు బ్లాక్ రైస్ తినాలని ఓ వైద్యుడి ద్వారా తెలుసుకున్న నేను మణిపూర్ నుంచి విత్తనాలు తీసుకువచ్చి పండించా. కానీ ఆలోపు మా నాన్న చనిపోయాడు. అయినా 10 ఏళ్లుగా బ్లాక్ రైస్ పండిస్తూ ఆరోగ్య సమస్యలున్న వారికి అందిస్తున్నా.

ఔషధ గుణాలు-ఫలితాలు

సాధారణ బియ్యం 100 గ్రాముల్లో 2 గ్రాముల ప్రొటీన్ ఉంటే ఈ కాలా నమక్‌లో 11-12 శాతం ప్రొటీన్ ఉంటుంది. జొన్నలు, సజ్జల కంటే తక్కువ గ్లైసిమిక్ ఇండెక్స్ 49 శాతం కలిగి ఉన్న ఈ బియ్యం తినడం వల్ల షుగర్ వ్యాధిని నయం చేయవచ్చు. జింక్ ఎక్కువ మోతాదులో ఉండడం వల్ల తెల్లరక్త కణాల ఉత్పత్తి, అభివృద్ధి చెంది, పనితీరు మెరుగుపడి, రోగనిరోధక శక్తి పెరుగుతుంది. హిమోగ్లోబిన్ శాతం పెరిగి రక్త ప్రసరణ మెరుగై శక్తి వంతులుగా ఉండేలా దోహదపడుతుంది. గర్భిణులకు లాభదాయకం. ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, ఏ విటమిన్, ఒమెగాఫ్యాట్లు ఉండటం వల్ల కేన్సర్, గుండె జబ్బు రాకుండా నివారించవచ్చు.

తెలుగు రాష్ట్రాల్లో మొదటి సాగు



వడ్లు, బియ్యాన్ని చూపుతున్న రైతు తిరుపతి

కాలా నమక్ వడ్లు తెలంగాణలో మొదటగా సిద్దిపేట జిల్లాలోని చేర్యాల మండలం నాగపురిలో తిరుపతి అనే రైతు సాగు చేశాడు. నల్లగా ఉండే ఈ వడ్ల పంట కాలం 130-140 రోజులు. బియ్యం తెల్లగా ఉంటాయి. ఎకరాకు 13-15 క్వింటాళ్ల వడ్ల దిగుబడి, 8-10 క్వింటాళ్ల బియ్యం వస్తాయి. సాగు ఖర్చు ఎకరాకు రూ.30వేలు, మార్కెట్‌లో కిలో బియ్యం రూ.130 నుంచి రూ.150 వరకు అమ్ముతున్నారు. ఆన్‌లైన్‌లో రూ.200 పైగా విక్రయిస్తున్నారు. అయితే కాలా నమక్ అంటే నల్లటి ఉప్పు అనుకుంటాం. వడ్ల నుంచి వచ్చిన బియ్యాన్ని కాలా నమక్ అంటారు. తింటే ఉప్పుగా ఉన్నాయి అందుచేత నమక్ అన్నారు.

ప్రత్యేకత ఇది

విత్తన ప్రత్యేకత ఏమిటంటే ఇది 3 వేల సంవత్సరాల క్రితం నుంచి సాగవుతుంది. గౌతమ బుద్ధుడు ఉత్తరప్రదేశ్‌లోని సిద్ధార్థ నగర్‌లో తపస్సు పూర్తి చేసి జ్ఞానోదయం పొందిన అనంతరం ప్రాంతాన్ని విడిచి వెళ్తున్న క్రమంలో అక్కడి స్థానికులు మీ గుర్తుగా ఏదైనా ఇవ్వాలని అడిగినప్పుడు బుద్ధుడు వారందరి ఆరోగ్య, మానసిక స్థితిని దృష్టిలో ఉంచుకుని 'కాలా నమక్' అనే ఈ నల్లటి వడ్లను ఇచ్చినట్లు చరిత్ర

ఆరోగ్యదాయక ఆహారం: తిరుపతి, రైతు

ప్రతీ రైతు తన ఇంటి అవసరాలకు సరిపడా ఆహారాన్ని సేంద్రియ విత్తనాలతో పండిస్తే కుటుంబంతో పాటు ప్రజలకు ఆరోగ్యదాయక ఆహారం అందించేలా కృషి చేయాలని ఈ ప్రయత్నం. విత్తనాలు, బియ్యం, వ్యవసాయ సలహాలు సూచనలకు 90002-69724 నంబర్‌లో సంప్రదించవచ్చు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని.. యూటర్న్ తీసుకొని..

- చెట్లపొదల్లో దూసుకెళ్లిన కారు

కొండపాక(గజ్వేల్): కారు అదుపు తప్పి రాజీవ్ రహదారిపై ఉన్న డివైడర్ మధ్యలోని విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యూటర్న్ తీసుకొని అవతలి వైపున ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో ఇంజన్ విడిపోయింది. ఈ సంఘటన కొండపాక మండలంలోని దుద్దెడ శివారులో కలెక్టరేట్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. దుబ్బాక మండలం కమ్మరపల్లికి చెందిన కొమ్మాట రవి ఎస్సీ కార్పొరేషన్ విభాగంలో కాంట్రాక్టు ఉద్యోగి. సిద్దిపేట నుంచి హైదరాబాద్ వైపునకు సొంత కారులో వెళ్తుండగా రాజీవ్ రహదారిపై అదుపు తప్పి రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభానికి బలంగా ఢీకొట్టి, యూటర్న్ అయి అవతలి వైపున ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. దీంతో రవి కాలుకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వాహనం నుంచి అతనిని బయటకు తీశారు. వెంటనే క్షతగాత్రుడిని సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



ప్రమాద స్థలంలో బోల్తా పడిన కారు

బంధువుల ఇంటికి వెళ్తూ.. అనంతలోకాలకు

పటాన్‌చెరు టౌన్: బంధువుల ఇంటికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్రగాయాలై మృతిచెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కోటేశ్వరరావు కథనం ప్రకారం... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని చైతన్యనగర్ కాలనీకి చెందిన వీరయ్య కుమారుడు మల్లేశ్ (25) శనివారం రాత్రి పోచారంలో ఉంటున్న బంధువుల ఇంటికి బుల్లెట్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో పటాన్‌చెరు శివారు.. ఒక పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం, ఇతని వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో మల్లేశ్ తలపై నుంచి వాహనం వెళ్లడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వఆస్పత్రికి తరలించారు. తండ్రి వీరయ్య ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

- ఎదురెదురుగా ఢీకొన్న లారీ, కారు
- చేవెళ్ల పీఎస్ పరిధిలో ఘటన

చేవెళ్ల: ఎదురెదురుగా వస్తున్న లారీ, కారు ఢీకొన్న ఘటనలో దంపతులు దుర్మరణం చెందారు. ఈ దుర్ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూర్ గ్రామానికి చెందిన మేకల లక్ష్మారెడ్డి(62), భాగ్యలక్ష్మి(48) దంపతులు. లక్ష్మారెడ్డి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం బీడీఎల్‌లో ఉద్యోగి. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు మనోహర్‌రెడ్డి లండన్‌లో ఉద్యోగం చేస్తుండగా.. చిన్న కుమారుడు రాజశేఖర్‌రెడ్డికి ఇటీవలే ఎయిర్‌ఇండియాలో ఉద్యోగం వచ్చింది. అతను సోమవారం ఉద్యోగంలో చేరాల్సి ఉంది. ఆదివారం భార్యతో కలిసి లక్ష్మారెడ్డి మండల పరిధిలోని దేవరంపల్లిలో ఉండే తోటి అల్లుడు దగ్గరకి తమ కారులో బయలుదేరారు. హైదరాబాద్ - బీజాపూర్ రహదారిలో వెళ్తుండగా మిర్జాగూడ స్టేజీ సమీపంలో లారీ, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. కారు వేగంగా ఉండడంతో లారీని ఢీకొని అదే వేగంతో పక్కనే ఉన్న మర్రిచెట్టుని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భాగ్యలక్ష్మి అక్కడికక్కడే మృతిచెందగా.. లక్ష్మారెడ్డిని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.



లక్ష్మారెడ్డి, భాగ్యలక్ష్మి దంపతులు(ఫైల్)

వ్యక్తి అదృశ్యం

గజ్వేల్‌రూరల్: పనిలో భాగంగా వేరే రాష్ట్రానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన గజ్వేల్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని భరత్ నగర్‌కు చెందిన పూడూరు అశోక్‌చారి(42)కి భార్య రాధిక, ఇద్దరు పిల్లలున్నారు. గ్లాస్ ఫిట్టింగ్ వర్క్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పనిలో భాగంగా సెప్టెంబర్ 9న ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ వెళ్లాడు. అక్కడి నుంచి అక్టోబర్ 9 వరకు కుటుంబ సభ్యులతో ఫోన్‌లో అందుబాటులో ఉన్నారు. ఆతర్వాత కాల్‌చేస్తే ఫోన్ స్విచ్ఛాఫ్ అని వస్తోంది. దీంతో కుటుంబ సభ్యులు ఈ ప్రాంతానికి వెళ్లి వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో కార్మికుడి ..

చేగుంట(తూప్రాన్): గుండెపోటుతో పరిశ్రమ కార్మికుడు మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బిహార్‌కు చెందిన రతన్‌తూరీ(58) పదేళ్లుగా చేగుంటలోని జీవిక పరిశ్రమలో కార్మికుడి పని చేస్తున్నాడు. ఆదివారం పరిశ్రమలో విధుల్లో ఉన్న సమయంలో అకస్మాత్తుగా కింద పడిపోయాడు. అక్కడే పనిచేస్తున్న తన కుమారుడు రాజ్, తోటికార్మికులు కలిసి అతనిని తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పరీక్షించి గుండె పోటుతో మృతిచెందినట్లు పేర్కొన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయని ఆందోళన

తూప్రాన్: బోరు మోటార్ల కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయని పట్టణ సమీపంలోని కిష్టాపూర్ హల్దీవాగు పరివాహక ప్రాంత రైతులు ఆదివారం ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉదయం తమ వ్యవసాయ పొలాల వద్దకు వెళితే కేబుల్ వైర్లు చోరీ అయిన విషయం గమనించామన్నారు. ప్రస్తుత యాసంగి సీజన్ కావడంతో బోరుమోటార్లు వినియోగించాల్సిన సమయంలో దొంగలు చోరీలకు పాల్పడడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మెతుకుసీమ

మణిమకుటాలు

- ఉన్నత పదవుల్లో ఉన్న జిల్లా వాసులు
- విభిన్న రంగాల్లో రాణిస్తూ తమదైన ముద్ర

సాక్షి ప్రత్యేకం

మెతుకుసీమ మణిమాణిక్యాలు.. పుట్టిన గడ్డకు వన్నె తెస్తున్నారు. విభిన్న రంగాల్లో రాణిస్తూ తమదైన ముద్ర వేస్తున్నారు. న్యాయ కోవిదులుగా.. పరిపాలన దక్షకులుగా.. సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. అలాగే ప్రగతి రథ చక్రాలను పరుగులు పెట్టిస్తున్నారు.. సినీరంగంలో తమ గానామృతంతో వేలాది మంది సంగీత ప్రియులను ఓలలాడిస్తున్నారు. రైతు కుటుంబం నుంచి రారాజుగా ఎదిగి తమ ప్రాంతవాసులకు మార్గదర్శకంగా నిలుస్తున్నారు. ఉన్నత పదవులు అధిరోహించిన మెదక్ జిల్లావాసులపై ప్రత్యేక కథనం..

– సాక్షి, నెట్‌వర్క్



వృత్తిలో విలక్షణం

హైకోర్టు జడ్జి శ్రవణ్ కుమార్



బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుగ్గిల్ల కు చెందిన ఎన్వీ శ్రవణ్ కుమార్ హైకోర్టులో జడ్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పీవీ నర్సింహారావు కుమార్తె నచ్చరాజు శారదాదేవి-వెంకటకిషన్ రావుల మూడో కుమారుడు ఈయన. 24 మార్చి 2017లో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. వృత్తిలో విలక్షణం ఒకే రోజులో 250కి పైగా కేసులు విచారించి 185 కేసులను పరిష్కరించి న్యాయ విధానంలో నిష్ణాతులుగా నిలిచారు. ఈ కార్యాచరణ తీర్పుల వేగం, ఆయన కృతనిశ్చయానికి ఉదాహరణగా నిలిచింది.

రైతు కుటుంబం నుంచి హైకోర్టు జడ్జి వరకు

చాడ విజయభాస్కర్‌రెడ్డి



దుబ్బాక: తెలంగాణ హైకోర్టు జడ్జిగా దుబ్బాకకు చెందిన చాడ విజయభాస్కర్‌రెడ్డి సేవలందిస్తున్నారు. రెండున్నర సంవత్సరాల క్రితమే హైకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. పలు కీలక కేసుల్లో తీర్పులను ఇచ్చారు. చాడ కేశవరెడ్డి పుష్పమ్మ దంపతుల చిన్న కుమారుడు విజయభాస్కర్‌రెడ్డి. కాగా పెద్దమ్మ విమలమ్మే పెంచి, పోషించి ఈస్థాయికి రావడానికి కృషి చేశారు. వరంగల్ కార్పొరేషన్ లాయర్‌గా పనిచేశారు. 8 సంవత్సరాలుగా తెలంగాణ హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాది(జీపీ) గా సేవలందించారు. రెండున్నర సంవత్సరాల క్రితమే హైకోర్టు జడ్జిగా నియామకం అయ్యారు. అప్పటి నుంచి తెలంగాణ హైకోర్టులో న్యాయమూర్తి గా సేవలందిస్తున్నారు.

మంగళపర్తికి... మణికొండ

రఘునందన్‌రావు ఐఏఎస్



వెల్దుర్తి(తూప్రాన్) : మండలంలోని మంగళపర్తికి చెందిన మణికొండ రాఘవేంద్రరావు, చంద్రకళ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రఘునందన్‌రావు (ఐఏఎస్) ప్రస్తుతం వ్యవసాయం, సహకారం ప్రభుత్వ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. కృష్ణా జిల్లా, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ను పంచాయతీరాజ్ కమిషనర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ప్రభుత్వ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

బోధన నుంచి పరిపాలన వైపు

రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ ఈటిరెడ్డి వెంకట నర్సింహారెడ్డి



జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌కు చెందిన ఈటిరెడ్డి వెంకట నర్సింహారెడ్డి 1989లో స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ ఉపాధ్యాయుడిగా గజ్వేల్ మండలం ఆహ్మదీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేరారు. నాలుగేళ్లు పనిచేసిన అనంతరం జగదేవ్‌పూర్ మండలం మునిగడప, జగదేవ్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. అనంతరం 1997లో గ్రూపు-1కు ఎంపికై వివిధ శాఖల్లో 2017 వరకు పనిచేశారు. 2017లో ఐఏఎస్‌గా ఎంపికై తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల కార్పొరేషన్ సంస్థ(టీఎస్ఐఐసీ) ఎండీ పనిచేశారు. మూడు నెలల పాటు ట్రైబ్యునల్ వెల్ఫేర్ డైరెక్టర్‌గా పనిచేశారు. 2024 జూన్‌లో ఐఏఎస్ బదిలీలలో భాగంగా రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్‌గా, సమగ్ర శిక్షా అభియాన్ ఆదనపు డైరెక్టర్‌గా నియామకం అయ్యారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నేడు రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

ప్రగతి రథ చక్రాలను పరుగులు పెట్టిస్తూ...

ఆర్‌టీసీ ఆర్‌ఎంగా రాజు రాణిస్తూ..



శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటకు చెందిన బొడ్డు రాజు ఆర్‌టీసీ ఆర్ఎంగా బాధ్యతలు నిర్వస్తున్నారు. పలు జిల్లాల్లో ఆర్‌టీసీ డీఎం, డీవీఎంగా పనిచేశారు. ఆ తరువాత పదో న్నతిపై కరీంనగర్ రీజినల్ మేనేజర్‌గా నియమితులయ్యారు. ప్రాథమిక విద్య శివ్వంపేట ప్రభుత్వ పాఠశాల, ఆపై చదువులు లింగంపల్లిలోని ప్రభుత్వ హాస్టల్, కాలేజీల్లో చదుకుని ఆర్‌టీసీ ఆర్ఎం స్థాయికి ఎదగారు.

డీటీగా ప్రస్థానం మొదలు పెట్టి.. బీసీ వెల్ఫేర్ కార్యదర్శి స్థాయికి..

శ్యాం ప్రసాద్



హుస్నాబాద్: డిప్యూటీ తహసీల్దార్‌గా జి.వి. శ్యాం ప్రసాద్ లాల్ ఉద్యోగ ప్రస్థానం మొదలుపెట్టారు. తహసీల్దార్‌గా, ఆర్డీఓగా, అడిషనల్ కలెక్టర్‌గా అంచలంచెలుగా ఎదిగారు. ఇటీవల తెలంగాణ బీసీ వెల్ఫేర్ స్కూల్స్ సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. శ్యాం ప్రసాద్ హుస్నాబాద్ వాసి. స్నేహ భావం, స్నేహత్వం కలిగిన విలక్షణ అధికారి. 1995లో గంభీరావు పేట డిప్యూటీ తహసీల్దార్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. 1999లో తహసీల్దార్‌గా పదోన్నతిపై మహాదేవపూర్‌కు వెళ్లారు. 2011లో కోరుట్లకు బదిలీ అయ్యారు. ఇదే సంవత్సరంలో ఆర్డీఓగా పదోన్నతి పొంది వరంగల్, కరీంనగర్ ఎస్‌డీసీగా బదిలీపై వెళ్లారు. 2014లో వరంగల్ రాజీవ్ విద్యా కమిషన్ పీఓగా పని చేశారు. అదనపు కలెక్టర్‌గా కరీంనగర్, పెద్దపల్లిలో పని చేశారు.

గాత్రంతో ఓలలాడిస్తూ..



రామాచారి

శివ్వంపేట(నర్సాపూర్): పెద్దగొట్టిముక్లకు చెందిన రామాచారి ప్రముఖ గాయకుడిగా, సంగీత దర్శకుడిగా పేరు ప్రఖ్యాతలు సాధించారు. ఎన్నో చిత్రాలకు పాటలు పడడంతో పాటు, సంగీత దర్శకుడుగా వ్యవహరిస్తున్నాడు. చిన్నతనంలోనే కళాకారులను ఉత్తమ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దలనే సంకల్పంతో హైదరాబాద్‌లో లిటిల్ మ్యూజిషియన్స్ స్థాపించి ఎంతోమంది బాలబాలికలను గాయకులుగా తయారు చేస్తున్నాడు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య



మోతిలాల్ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): అప్పుల బాధతో పాటు కుటుంబ కలహాలతో రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధి తాళ్లపల్లి తండాలో చోటుచేసుకుంది. ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన ధనావత్ మోతిలాల్ (35) వ్యవసాయం, పౌల్ట్రీఫామ్‌తో జీవనోపాధి పొందుతున్నాడు. కుటుంబ పోషణ ఇతర అవసరాల కోసం అప్పులు చేశాడు. దానికి తోడు కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఆదివారం ఉదయం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా గుర్తించిన కుటుంబ సభ్యులు వైద్యం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు భార్యలు, ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతుడి మొదటి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

విడాకులు రావడంతో మనస్తాపంతో పురుగుల మందు తాగి వ్యక్తి..

సిద్దిపేటఅర్బన్: కోర్టు నుంచి విడాకులు మంజూరు కావడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. అంబేడ్కర్ నగర్‌కు చెందిన పొడిశెట్టి సంజీవ్ (35) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. మూడు సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది. కుటుంబ కలహాలతో భార్య విడాకులకు దరఖాస్తు చేసుకుంది. నవంబర్ 28న కోర్టు విడాకులు మంజూరు చేసింది. దీంతో మనస్తాపానికి గురయ్యాడు కాగా, సంజీవ్ తన తల్లిని సిద్దిపేట రైతు బజార్ వద్ద దింపి అక్కడి నుంచి వడిశెలకుంట వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఎల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి..



నర్సింహులు మృతదేహం

చేగుంట(తూప్రాన్): అనారోగ్యంతో బాధపడుతూ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చిట్టోజిపల్లిలో ఆదివారం చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తలారి నర్సింహులు(49) గ్యాస్‌ట్రబుల్ సమస్యతో బాధపడుతున్నాడు. మూడు నెలల క్రితం ఎడమ భుజానికి గాయమై తన అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతూనే మానసికంగా బాధపడుతున్నాడు. ఈ క్రమంలో కుటుంబసభ్యులంతా వ్యవసాయ పనులకు వెళ్లగా తాను ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పొలం నుంచి వచ్చిన వారు నర్సింహులు విగత జీవిగా చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆ మేరకు పోలీసులకు సమాచారం అందించారు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్

- బైకిస్ట్‌కు తీవ్ర గాయాలు



ఘటన స్థలంలో దగ్ధమవుతున్న బైక్

తూప్రాన్: ఎదురుగా వస్తున్న బైక్‌ను టిప్పర్ ఢీకొన్న ఘటనలో బైకిస్ట్‌కు తీవ్రగాయాలయ్యా యి. దీంతోపాటు ఘటన స్థలం వద్ద బైక్ దగ్ధమైన ఘటన పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్‌కు చెందిన మర్యాల దశరథ 12వ వార్డు బీడీ కాలనీలో ఇస్త్రీ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తన అవసరం నిమిత్తం బైక్‌పై వస్తున్నాడు. నర్సాపూర్ చౌరస్తా వద్దకు రాగానే వేగంగా వచ్చిన టిప్పర్ ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొంది. దీంతో దశరథ కిందపడిపోయాడు. అతని కాళ్లపై నుంచి టిప్పర్ చక్రాల వెళ్లడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆ వెంటనే కింద పడిన బైక్‌లోంచి మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. క్షతగాత్రుడిని 108లో సూరారంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

శివ్వంపేటలో వ్యక్తి..



సంజీవ్(ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పెద్దకొళ్ల సంజీవ్ (26) ఆటో నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం తన భార్య శ్రీకన్యను హత్నూరలోని ఆమె పుట్టింట్లో దింపేసి వచ్చాడు. రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.